క్లుప్తంగా

నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన పక్కా భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శనివారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. పనులు నాణ్యతగా ఉండాలని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్య అధిక సంఖ్యలో ఉండడంతో మరో అంతస్తు నిర్మాణం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని, బస్టాండ్ నుంచి కళాశాల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు పింగిళి రమేష్, ఎండీ ఆరీఫ్, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా నాయకులు పాల్గొన్నారు.

17న బోనాల జాతర

మంచిర్యాలఅర్బన్: స్థానిక కట్టమ్మ పోచమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 17న నిర్వహించే బోనాల జాతరకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు సంజీవ్, మజీద్, ప్రభాకర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు నరేష్, జాతర నిర్వాహకుడు శంకర్, పలువురు పాల్గొన్నారు.

జూనోసిస్ దినోత్సవం

బెల్లంపల్లిరూరల్: మండలంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూగ జీవాలకు వ్యాక్సిన్ టీకా వేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. మూగ జీవాలు, జంతువుల నుంచి సోకే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని తెలిపారు. మూగ జీవాలు, పెంపుడు జంతువులపై వాటి యజమానులు జాగ్రత్తలు పాటించి క్రమం తప్పకుండా వ్యాధినిరోధక, ఇతర టీకాలను వేయించాలని సూచించారు. బెల్లంపల్లి లయన్స్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి దిలీప్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కట్కూరి సత్యనారాయణ, కార్యదర్శి పైడాకుల రాజన్న, కోశాధికారి ఆద ర్శవర్ధన్ రాజు, రీజియన్ చైర్మన్ రాజయ్య, జోన్ చైర్మన్ పాపయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బూర్గుపల్లి పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి సురేష్

భీమారం: మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ సురేష్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో పాత విద్యార్థుల సంఖ్యతో పాటు కొత్తగా చేరిన వారి వివరాలను హెడ్మాస్టర్ విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుడికి బ్యాటరీ వీల్‌చైర్ పంపిణీ



పంపిణీ చేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: దివ్యాంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ ఆవరణలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భీమారం మండల ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన సూరం పవన్‌కుమార్ అనే దివ్యాంగుడికి జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి చిన్నయ్యతో కలిసి రూ.1.20లక్షల విలువ చేసే బ్యాటరీ వీల్‌చైర్ అందజేశారు. జిల్లాలో మరో 8మందికి బ్యాటరీ వీల్‌చైర్స్ మంజూరయ్యాయని, త్వరలోనే అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూర్: చెన్నూర్ నుంచి జాతీయ రహదారి మీదుగా మహారాష్ట్రకు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి పట్టుకున్నారు. రేషన్ బియ్యం పట్టుకొని సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. పట్టుకున్న వారిలో కాంగ్రెస్ నాయకులు కొంపల్లి బానేశ్, చింతల శ్రీనివాస్, పెండ్యాల శ్రీకాంత్, చెన్న వెంకటేశ్ ఉన్నారు.

ఆటాడుకుందాం...

- హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా గేమ్‌జోన్
- చిన్నారులతో పాటు పెద్దవారు ఆడుకునేలా ఏర్పాటు
- వీకెండ్స్‌లో చిన్నా, పెద్దలకు ఆటవిడుపు



మంచిర్యాలటౌన్: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకు దీటుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో చిన్నారులతో పాటు, పెద్దలు సరదాగా ఆడుకునేలా గేమ్ జోన్‌లు ఏర్పడుతున్నాయి. సెలవు రోజుల్లో, వారాంతాలైన శని, ఆదివారాల్లో చిన్నారులను తీసుకొని సరదాగా ఆయా గేమ్ జోన్‌లకు వెళ్లి, పలు రకాల ఆటలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. పెద్ద నగరాలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రకాల ఆటలు ఆడేలా ఏర్పాటు చేస్తున్న గేమ్‌జోన్‌లు చిన్నారులతో పాటు, తల్లిదండ్రులను బాగా ఆకట్టుకుంటున్నాయి. సెలవురోజుల్లోనే కాకుండా, మిగితా రోజుల్లో సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పిల్లలతో గేమ్ జోన్ రద్దీగా మారుతుందంటే, ఎంతగా ఆకట్టుకుంటున్నాయో అర్థమవుతోంది. చిన్నారులను సరదాగా తీసుకెళ్లే పెద్ద వారికి సైతం ఆడుకునేందుకు సరదా ఆటలు ఒకేచోట లభిస్తుండడంతో కుటుంబ సభ్యులందరూ కలిసి వచ్చి రెండు నుంచి మూడు గంటల సమయం గడుపుతున్నారు. ఒక్కసారి ఇక్కడికి వచ్చిన వారు మళ్లీ మళ్లీ వచ్చేందుకు ఆసక్తిని చూపిస్తుండడంతో నిత్యం గేమ్‌జోన్ రద్దీగా మారుతోంది. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఇలాంటి గేమ్ జోన్‌కు వెళ్తే అయ్యే ఖర్చు కన్నా, ఇక్కడ తక్కువగా లభిస్తుండడం వల్లనే తరుచూ వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.



పిల్లలతో కలిసి ఆడుకునేలా..



జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గల బైక్ షోరూం యజమాని తన మనవడు తరుచూ గేమ్ జోన్‌కు తీసుకెళ్లాలంటూ ఇంట్లో మారాం చేస్తున్నాడని, ఇలాంటి పరిస్థితులు అందరి ఇళ్లల్లోనూ ఉంటాయని భావించి, తన షోరూం పైననే గేమింగ్ జోన్‌ను పూర్తి అధునాతనంగా ఉండేలా ఏర్పాటు చేశారు. చిన్నారులను తీసుకొచ్చిన తల్లిదండ్రులు కూడా పలు రకాల గేమ్స్‌ను ఆడుకునేలా దీనిని ఏర్పాటు చేయడంతో, అందరిని విశేషంగా ఆకర్షిస్తోంది. రోజంతా వివిధ పనులతో క్షణం తీరిక లేకుండా గడిపే తల్లిదండ్రులకు గేమ్ జోన్‌లోకి అడుగు పెట్టగానే వారిలోని ఒత్తిడి ఒక్కసారిగా తొలగిపోయి, పిల్లలతో కలిసి సరదాగా రెండు నుంచి మూడు గంటల పాటు గడిపేస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా గేమ్ జోన్‌ను అలంకరించగా, వీడియో గేమ్స్, సాఫ్ట్ ప్లే, వీఆర్, రేసింగ్, షూటింగ్, కారు, బైక్ డ్రైవింగ్, బాల్స్‌తో సరదాగా ఆడుకునేలా రూపొందించారు. ఆటలతో పాటు ఒక్కో లెవల్‌ను దాటిన వారికి టికెట్లు అందించి, వాటి ద్వారా బహుమతులు సైతం అందిస్తుండడం విశేషం. వీటితో పాటు, చాక్లెట్లు, బొమ్మలను ఆటలతో గెలుపొందేలా పలు రకాల ఆటలు ఇందులో ఉండడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చిన్నారుల్లో ఎక్కువగా షూటింగ్ గేమ్స్‌తో పాటు, కార్, బైక్ రేసింగ్ గేమ్స్‌లను ఇష్టపడుతుండడం విశేషం.

చిన్నారులకు ఆటవిడుపు ఉండాలనే..



చిన్నారుల నుంచి పెద్ద వయస్సు వారు ఆహ్లాదంగా గడిపేందుకు దీనిని ఏర్పాటు చేశాం. ఈ గేమ్‌జోన్‌లో అన్ని రకాల వీడియోగేమ్స్, షూటింగ్ గేమ్స్, రేసింగ్ గేమ్స్, సాఫ్ట్ ప్లేజోన్, వీఆర్ గేమ్స్, చిన్నారులు ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాటు చేశాం. గేమ్స్ ఆడిన వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు గాను వారికి రకరకాల బహుమతులు అందజేస్తుండడం, పిల్లలతో కలిసి పెద్దలు కూడా ఆటలను ఆడుకునేలా ఏర్పాటు చేయడంతో అందరూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

– గుండ సుధాకర్, గేమ్‌జోన్ యజమాని, మంచిర్యాల

ఘనంగా జగ్జీవన్‌రాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

జన్నారం: సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడు బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు ఇందయ్య, ప్రభుదాస్, రాజేశ్వర్, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు డాక్టర్ శరత్‌బాబు, కుంటాల శంకర్, మోతే పోచం, గొడిశెల దశరథం, చుంచు శంకర్, గద్దం సత్యం, దుర్గం స్వామి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటి సభ్యులు వెంకటేష్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రిరూరల్: తెలంగాణలో నూతన బొగ్గు గనులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ శనివారం టీబీజీకేఎస్ నాయకులు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలోని నూతన బొగ్గు గనులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి



దండేపల్లి: శ్యామప్రసాద్ చిత్రపటం వద్ద నివాళ్లు

దండేపల్లి: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని దండేపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు శ్రీనివాస్, సురేందర్, రాకేష్, అశోక్, సత్తయ్య, రవీందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

భీమారం: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని కాజిపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు బొర్లకుంట శంకర్ మొక్కలు నాటారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ నుంచి ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ శనివారం రాత్రి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా పనిచేసిన ప్రేమ్‌సాగర్‌రావుతో, ప్రస్తుత ఎమ్మెల్సీ కలిసి పలు అంశాలను చర్చించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన తరువాత మొదటిసారి జిల్లాకు వచ్చిన విఠల్, నేరుగా మంచిర్యాలలోని ప్రేమ్‌సాగర్‌రావు నివాసంకు వెళ్లి కలిసి సన్మానించారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల రిలే దీక్ష

మంచిర్యాలఅగ్రికల్చర్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో శనివారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

ప్లే స్కూల్స్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

తాండూర్: ప్రైవేట్ పాఠశాలల్లోని ప్లే స్కూల్స్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌లో నూతన సిలబస్‌ను ప్రవేశ పెట్టిన నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, ప్రభావతి, ఇందిరా,రమ, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు'

చెన్నూర్: ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావని, చిన్నచిన్న విషయాలకు ఒత్తిడికిలోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని ఎస్సై శ్వేత అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మహత్యలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

విశ్వహిందూ పరిషత్ జిల్లా సమావేశం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించి 60సంవత్సరాలు పూర్తికానున్న సందర్భంగా పలు తీర్మానాలు చేసి, స్థాపన దివస్ పురస్కరించుకుని జిల్లాలో ఆత్మీయ సమావేశాలను నిర్వహించాలని తీర్మానించారు.

బుక్ స్టాల్‌పై చర్యల కోసం నిరసన

బెల్లంపల్లిరూరల్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ బుక్ స్టాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేట్ బుక్ స్టాల్ వద్ద శనివారం విద్యార్థి సంఘాల నాయకులు నిరసన చేపట్టారు.

'డ్రగ్స్‌కు బానిస కావొద్దు'

భీమిని: డ్రగ్స్, గుడుంబా నిషేధిత పదార్థాలకు యువత బానిస కావొద్దని భీమిని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిషేధిత పదార్థాల అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్‌క్రైమ్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బెనిఫిట్స్ అందజేత

నెన్నెల: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనికి చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్, జనరల్ మజ్దూర్ కార్మికుడు కర్రె రాజు ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా వారికి అందాల్సిన టర్మినల్ బెనిఫిట్స్ సోషల్ సెక్యూరిటీ ఫండ్, మ్యాచింగ్ గ్రాంట్‌లను శనివారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

బెంచీల కోసం దరఖాస్తు

వేమనపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అవసరాల కోసం బెంచీలు, ఫర్నీచర్ అందజేయాలని విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఇన్‌చార్జి కాటే సూర్యనారాయణకు వేమనపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: మండలంలోని సోమనపల్లి గ్రామంలో గల నా సొంత భూమిలో నాటిన 200మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు భీమిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు.

ఉపాధ్యాయుడిని సన్మానించిన ఆటో డ్రైవర్లు

కాసిపేట: మండలంలోని కొత్తవరిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఆంజనేయశర్మను శనివారం అంజనీపుత్ర ఆటో యూనియన్ కాసిపేట ఆధ్వర్యంలో సన్మానించారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష

- పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధిపై చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం మున్సిపల్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు తదితర సమస్యల ను అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాలకవర్గం లేని మున్సి పాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుదామన్నారు. అమృత్ పథకం ద్వారా రూ.31కోట్లతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పట్టణంలోని 15, 16వార్డుల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీల్లో మొక్కలు నాటారు. అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకులను పరామర్శించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ సుమతి, ఏఈ అచ్యుత్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలు జరిపించాలని ఎమ్మెల్యేకు వినతి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శనివారం మంచిర్యాలలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికల జేఏసీ కమిటీ నాయకులు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి చర్చించుకుందామని ఎమ్మెల్యే తెలిపినట్లు జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

పేదల సమస్యను పరిష్కారం చేయాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- జీఎం సంజీవరెడ్డి



విజయకేతనం చూపెడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సింగరేణి పర్యావరణ పరిరక్షణ కోసం వేలాది ఎకరాల్లో లక్షలాది మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఓటుజీఎం ఏవీ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ స్వామిరాజు, ఎస్ఓ కొట్టె రమేశ్, సీనియర్ పీఓ పాల్‌సృజన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: పేదల సంక్షేమం కోసం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. గతంలో నియంత పోకడలతో పాలన సాగిందన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలదరికి చేరాలని ప్రస్తుత ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందరికీ అందించి, న్యాయం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు సతీశ్‌కుమార్, రజాక్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

తాండూర్: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఏఈ విష్ణు కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

బెల్లంపల్లిరూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సీ.హెచ్ దుర్గాప్రసాద్ అన్నారు.మండలంలోని మాలగురిజాల, రంగపేట, చర్లపల్లిలోని పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో మహేందర్, ఈడబ్ల్యూఎస్ ఏ.ఈ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువును కబ్జా నుంచి కాపాడాలి



బైఠాయించిన రేండ్లగూడ వాసులు

జన్నారం: రేండ్లగూడలోని అల్లంవారి కుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన యువకులు, రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి మాట్లాడుతూ రేండ్లగూడలోని అల్లంవారి కుంటను అదే గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసుకుని బావులు తవ్వుకుని పొలాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో చెరువు నీరు కిందికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై ఇదివరకే రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వే నిర్వహించి చెరువుకు హద్దులు ఏర్పాటు చేయడమే కాకుండా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అల్లం పెద్దయ్య, అల్లం రవి, అజ్జు, వెయికండ్ల రవి, సందవేని పవన్, చారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం విద్యుత్‌శాఖ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మెగ రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారి (ఎస్) శ్రావణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడమే కాదు, ఆపదలో ఉన్నవారిని సైతం ఆదుకునేందుకు ఉద్యోగులు రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతగా నిలిచిపోవడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరంలో 136మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీఈలు కైసర్, బి.రాజన్న, పెద్ది రాజం, ఏడీఈలు మోహన్‌రెడ్డి, బాలకృష్ణ, తిరుపతి, కాతం శ్రీనివాస్, శరత్, ఏఈలు కలీం, మంచాల శ్రీనివాస్, సాయిక్రిష్ణ, మహేందర్‌రెడ్డి, వివిధ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులలో సీజనల్ వ్యాధులపై అధికారులు, మెప్మా సభ్యురాళ్లు, కౌన్సిలర్లు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు.